# సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమం

ఆంగ్ల సంస్కృతి ప్రభావంతో క్రీ.శ. 19వ శతాబ్దంలో ఆంధ్రదేశంలో కూడా సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమం ప్రారంభమైంది. గతకాలపు సంస్కృతిని పునరుద్ధరించాలనే లక్ష్యంతో సాగిన ఈ ఉద్యమాన్ని సాంఘిక, మత ఉద్యమం అని కూడా పేర్కొంటారు. ఆంగ్ల విద్య ప్రభావం, క్రైస్తవ మిషనరీల పాత్ర, పత్రికలు, సంఘ సంస్కర్తల కృషి లాంటి అనేక కారణాలు ఈ ఉద్యమానికి దోహదం చేశాయి. ఆంధ్రాలో సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాన్ని కందుకూరి వీరేశలింగం యుగం అని వర్గీకరిస్తారు.

**కారణాలు:**

1835లో విలియం బెంటింక్ ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టారు. ఆంగ్ల విద్యను అభ్యసించిన వారు ఉదారవాదం, మానవతావాదం, హేతువాదం లాంటి నూతన సిద్ధాంతాలను అధ్యయనం చేసి సంఘ సంస్కరణకు కృషి చేశారు. సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలపై పోరు ప్రారంభించారు. 1857లో కలకత్తా, బొంబాయి, మద్రాస్ విశ్వవిద్యాలయాలు ఏర్పాటయ్యాయి.

★ 1805లో లండన్ మిషన్ సొసైటీ జమ్మలమడుగు (కడప జిల్లా) కేంద్రంగా 1835లో అమెరికన్ బాప్టిస్ట్ సంఘం రాయలసీమలో, 1841లో చర్చి మిషన్ సొసైటీ కృష్ణా, గోదావరి ప్రాంతాల్లో విద్యావ్యాప్తికి, మత ప్రచారానికి కృషి ప్రారంభించాయి.

★ రాజా రామమోహన్‌రాయ్, దయానంద సరస్వతి, స్వామి వివేకానంద లాంటి జాతీయ సంఘ సంస్కర్తల ఉద్యమాలు ఆంధ్రులను ప్రభావితం చేశాయి.

★ బ్రహ్మ సమాజ కార్యకలాపాలకు రాజమండ్రి, బ్రహ్మ సమాజ సిద్ధాంతాలకు బాపట్ల, బ్రహ్మ సమాజ ఆలోచనలకు మచిలీపట్నం కేంద్రాలు అయ్యాయి.

★ కందుకూరి సత్యసంవర్ధని, మన్నవ బుచ్చయ్య పంతులు హిందూ రిఫార్మర్, రాయసం వెంకటశివుడి జనానా లాంటి పత్రికలు సంఘ సంస్కరణ ఉద్యమాన్ని ప్రచారం చేశాయి.

★ 1872లో ఉమారంగనాయకులు నాయుడి సంపాదకత్వంలో మచిలీపట్నం నుంచి పురుషార్థ ప్రదాయని పత్రిక వెలువడింది.

★ కొక్కొండ వెంకటరత్నం తన ఆంధ్రభాషా సంజీవని పత్రిక ద్వారా కందుకూరి భావాలను విమర్శించేవారు.

★ అముద్రిత గ్రంథ చింతామణి పత్రికను నెల్లూరు నుంచి కె.రామకృష్ణయ్య వెలువరించారు.

★ 1891లో న్యాపతి సుబ్బారావు ఆధ్వర్యంలో రాజమండ్రిలో చింతామణి పత్రిక ప్రారంభమైంది.

★ చిలకమర్తి లక్ష్మీనరసింహం రామచంద్ర విజయం, హేమలత, అహల్యాబాయి లాంటి నవలలు చింతామణి పత్రికలో ప్రచురితమయ్యాయి.

**తొలి సంస్కర్తలు (కందుకూరి ముందు యుగం)**

భారతదేశ సాంస్కృతిక పునర్వికాస పితామహుడిగా రాజా రామమోహన్‌రాయ్‌ను పేర్కొంటే, ఆంధ్ర సాంస్కృతిక పునర్వికాస పితామహుడిగా కందుకూరి వీరేశలింగం పంతులు గారిని పేర్కొంటారు.

★ మద్రాస్ కోర్టులో దుబాసీగా పనిచేసిన ఏనుగుల వీరాస్వామి సాంఘిక దురాచారాలు, వాటికి దారితీసిన కారణాలపై కాశీయాత్రలు లాంటి రచనలు చేశారు.

★ బడి పుస్తకాల్లో మార్పులు చేయడం ద్వారా దేశీయ విద్యలో లోపాలను సరిదిద్దాలని వెన్నెలకంటి సుబ్బారావు ప్రచారం చేసేవారు.

★ సామినేని ముద్దు నరసింహనాయుడు (రాజమండ్రి) హితసూచని (1862) గ్రంథంలో సాంఘిక సంస్కరణ ఉద్యమ ఆవశ్యకతను వివరించారు.

★ కోమలేశ్వర శ్రీనివాస పిళ్లై స్త్రీ విద్యావ్యాప్తి కోసం రూ. 70 వేలు విరాళంగా ఇచ్చారు.

★ నెల్లూరు ప్రాంతంలో కె. అనంతరామశాస్త్రి హరిజనోద్ధరణకు కృషి చేశారు.

★ పరవస్తు వెంకట రంగాచార్యులు (విశాఖపట్నం) వితంతు వివేకం అనే గ్రంథాన్ని రచించారు. ఈయన స్త్రీ పునర్వివాహాలు న్యాయ సమ్మతమేనని వాదించారు.

★ గాజుల లక్ష్మీనరసుసెట్టి తన క్రిసెంట్ పత్రిక ద్వారా సాంఘిక చైతన్యాన్ని కలిగించారు.

★ వేదాంతాచారి అనే ఉద్యోగి (విద్యాశాఖ) బాల్య వివాహాలను నిషేధిస్తూ, హిందూ వివాహ విధానంలోని లోపాలను సవరిస్తూ శాసనాలు చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు.

★ ఎల్లాప్రగడ సుబ్బారావు ఆంధ్రాలో దివ్యజ్ఞాన సమాజ సిద్ధాంతాలను ప్రచారం చేయడమే కాకుండా కల్నల్ ఆల్కాట్ ఆంధ్ర పర్యటన ఏర్పాటు చేశాడు.

★ ఆత్మూరి లక్ష్మీనరసింహం (కందుకూరి గురువు) స్త్రీ పునర్వివాహ సమాజంలో సభ్యుడిగా పనిచేశారు.

## కందుకూరి వీరేశలింగం (1848 – 1919)

ఆంధ్ర పునర్వికాస పితామహుడు, దక్షిణ భారత విద్యాసాగరుడు, గద్య తిక్కన బిరుదులు పొందిన కందుకూరి వీరేశలింగం 1848లో ఏప్రిల్ 16న రాజమహేంద్రవరంలో జన్మించారు. తండ్రి సుబ్బారాయుడు, తల్లి పున్నమ్మ. దూసి సోమయాజులు వద్ద సంస్కృత భాషను అధ్యయనం చేశారు. 12వ ఏట రాజ్యలక్ష్మి (బాపమ్మ)తో వివాహం జరిగింది. 1919, మే 27న చనిపోయేవరకు సంస్కరణ ఉద్యమాన్ని నడిపారు.

★ 1872లో తూర్పుగోదావరి జిల్లాలోని కోరంగి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు.

★ 1873లో గద్య తిక్కన బిరుదు పొందారు. మద్రాస్‌లో సమర్థ రంగయ్య శెట్టి కందుకూరి వారికి గద్యతిక్కన బిరుదును ప్రధానం చేశారు.

★ 1874లో ధవళేశ్వరంలో తొలి బాలికా పాఠశాలను ప్రారంభించారు.

★ మల్లాది అచ్చన్న శాస్త్రిని తన బాలికా పాఠశాలకు తొలి ప్రధానోపాధ్యాయులుగా నియమించారు.

★ 1874లోనే మద్రాస్‌లో వితంతు పునర్వివాహ సంఘాన్ని ప్రారంభించారు. వివేకవర్ధిని పత్రికను (మాస పత్రిక) స్థాపించారు.

★ 1876లో హాస్య సంజీవని పత్రికను ప్రారంభించారు.

★ 1878 సెప్టెంబరులో రాజమండ్రిలో సంఘ సంస్కరణ సమాజం/ ప్రార్థనా సమాజాన్ని స్థాపించారు.

★ 1879, ఆగస్టు 3న రాజమండ్రిలో తొలి బహిరంగ ఉపన్యాసం ఇచ్చి, స్త్రీ పునర్వివాహం న్యాయ సమ్మతమే అని ప్రకటించారు.

★ 1880లో రాజమండ్రిలో స్త్రీ పునర్వివాహ సంఘాన్ని ప్రారంభించారు.

★ 1881, డిసెంబరు 11న రాజమండ్రిలోని తన నివాసంలో తొలి వితంతు వివాహాన్ని జరిపించారు. (భారతదేశంలో తొలి వితంతు వివాహం ఈశ్వర చంద్రవిద్యాసాగర్ 1856లో కలకత్తాలో జరిపించారు). వరుడు గోగులపాటి శ్రీరాములు, వధువు గౌరమ్మ (సీతమ్మ).

★ కందుకూరి జరిపించిన తొలి వితంతు వివాహానికి ఆర్థిక సహాయం అందించింది పైడా రామకృష్ణయ్య, పెళ్లి మంత్రాలు చదివింది పి. ఆనందాచార్యులు

★ రాచర్ల రామచంద్రరావు, రత్నమ్మలకు 1881, డిసెంబరు 15న రెండో వితంతు వివాహం జరిపించారు.

★ 1883లో సతీహితబోధిని మాస పత్రికను ప్రారంభించారు.

★ 1891లో సత్యసంవర్ధని పత్రికను ప్రారంభించారు.

★ నరసాపురం కేంద్రంగా సుజాయత్ ఆలీఖాన్ ప్రారంభించిన 'విద్వన్న మనోహరిణి' పత్రిక వివేకవర్ధినిలో విలీనమైంది. న్యాపతి సుబ్బారావు చింతామణి పత్రికకు కూడా కందుకూరి సంపాదకుడిగా వ్యవహరించారు.

★ రాయసం వెంకటశివుడి తెలుగు జనానా పత్రికకు సంపాదకుడిగా వ్యవహరిస్తున్న కాలంలో విదేశీ నారీమణుల చరిత్రము అనే వ్యాసాన్ని అందులో ప్రచురించారు.

★ 1897లో మద్రాస్‌లో వితంతు శరణాలయాన్ని ప్రారంభించారు. రాజమండ్రిలో మాత్రం 1905లో వితంతు శరణాలయాన్ని ప్రారంభించారు.

★ 1898లో ఎం.జి. రనడే మద్రాస్‌లో జరిగిన సంఘ సంస్కరణ సమావేశంలో కందుకూరిని దక్షిణ భారత విద్యాసాగరుడు అనే

www.eenadupratibha.net

బిరుదుతో సత్కరించారు.

★ 1906లో రాజమండ్రిలో హితకారిణి సమాజాన్ని స్థాపించారు.

★ నాటి రాజమండ్రి ప్రభుత్వ కళాశాల ప్రధానాధికారి ఇ.పి. మెట్‌కాఫ్ కందుకూరికి ఎంతో సహకరించారు.

★ మానింగ్ అనే ఆంగ్ల వనిత కందుకూరి వితంతు శరణాలయానికి ఆర్థిక సహాయాన్ని అందించింది.

★ తెలుగులో తొలి సాంఘిక నవలగా పేరొందిన రాజశేఖర చరిత్రను రచించారు. ఈ గ్రంథం ఆలీవర్ గోల్డ్‌స్మిత్ రచన వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్ ఆధారంగా రాసింది.

★ జోనాథన్ స్విఫ్ట్ రచన గలీవర్ ట్రావెల్స్ ఆధారంగా సత్యరాజా పూర్వ దేశయాత్రలు అనే గ్రంథాన్ని రాశారు.

★ ఆంధ్ర కవుల చరిత్ర గ్రంథం రాయడం ద్వారా తొలిసారిగా ఆంధ్ర సాహిత్య చరిత్రకు శ్రీకారం చుట్టారు.

★ కాళిదాసు, షేక్స్‌పియర్ నాటకాలను తెలుగులోకి అనువదించారు.

★ పెద్దయ్యగారి పెళ్లి, వ్యవహార ధర్మబోధిని (ప్లీడర్ నాటకం), మూషికాసుర విజయం, తిర్యగ్విద్వాన్ మహాసభ లాంటి నాటకాలు, ప్రహసనాలు రాశారు.

★ విక్టోరియా మహారాణి చరిత్ర, నారద సరస్వతి సంవాదం, చమత్కార రత్నావళి, బ్రహ్మవివాహం (కన్యాశుల్కంపై విమర్శ నాటకం) లాంటి రచనలు చేశారు.

★ ఆంగ్ల కవి షేరిటాన్ రచనలు ది రైవల్స్ ఆధారంగా కళ్యాణ కల్పవల్లి, డ్యూయన్నా ఆధారంగా రాగమంజరి లాంటి రచనలు చేశారు.

★ 1919, మే 27న మద్రాస్‌లోని కొమర్రాజు లక్ష్మణరావు నివాసమైన వేదవిలాస్‌లో కందుకూరి మరణించారు.

★ కందుకూరి అభినవాంధ్రులకు ఆది బ్రహ్మ అని ఆరుద్ర వ్యాఖ్యానించారు.

★ "తన దేహం, గేహం, కాలం, విద్య, తన ధనం ప్రజలకు అర్పించిన ఘనుడు కందుకూరి" అని చిలకమర్తి లక్ష్మీనరసింహం పేర్కొన్నారు.

★ కందుకూరి – గద్య తిక్కన, గద్య వాఙ్మయ బ్రహ్మ, యుగకర్త లాంటి బిరుదులు పొందారు.

## రఘుపతి వేంకటరత్నం నాయుడు (1862 – 1939)

1862లో మచిలీపట్నంలో జన్మించారు. మద్రాస్ క్రిస్టియన్ కళాశాలలో చదివారు. మన్నవ బుచ్చయ్య పంతులు సహకారంతో బ్రహ్మ సమాజంలో సభ్యుడయ్యారు.

★ కాకినాడ కేంద్రంగా బ్రహ్మ సమాజ సిద్ధాంతాలను బాగా ప్రచారం చేశారు.

★ 1891 లో సాంఘిక శుద్ధి సంఘం (Social Purity Association) స్థాపించారు. సాంఘిక శుద్ధి ఉద్యమాన్ని నడిపారు. (శుద్ధి ఉద్యమాన్ని నడిపింది దయానంద సరస్వతి).

★ దేవదాసీ వ్యవస్థ నిర్మూలనకు కృషి చేశారు.

★ సోషల్ రిఫార్మర్ ఫెలోవర్కర్, పీపుల్స్ ఫ్రెండ్, బ్రహ్మప్రకాశిక లాంటి పత్రికలు నడిపారు. బ్రహ్మర్షి, అభినవ సోక్రటీస్, కులపతి లాంటి బిరుదులు పొందారు.

★ ఆయన చేసిన విద్యారంగ కృషికి ఆంగ్ల ప్రభుత్వం నైట్‌హుడ్ బిరుదు ఇచ్చింది.

★ తన గురువు మిల్లర్ పేరున 'ఆంధ్ర బ్రహ్మప్రచారక నిధి'ని ఏర్పాటు చేశారు.

## గురజాడ వేంకట అప్పారావు (1861 – 1915)

1861, నవంబరు 30న విశాఖపట్నం జిల్లా రాయవరంలో జన్మించారు. విజయనగర మహారాజు, మహారాణి (రీనా)ల వద్ద దివాన్‌గా పనిచేశారు.

★ 1896లో కన్యాశుల్కం నాటకాన్ని రాశారు. వ్యవహారిక భాషలో రాసిన తొలి నాటకం కన్యాశుల్కం.

www.eenadupratibha.net

★ 1910లో ముత్యాలసరాలు అనే దేశభక్తి ప్రేరిత రచన చేశారు.

★ దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్, దేశమును ప్రేమించుమన్నా మంచియన్నది పెంచుమన్నా లాంటి గీతాలు రచించారు.

★ మంచి యన్నది మాల అయితే ఆ మాలనే నేనగుదున్ అని పలికారు.

★ పుత్తడి బొమ్మ పూర్ణమ్మ, కన్యక, దిద్దుబాటు లాంటి రచనలు కూడా చేశారు.

★ తెలుగులో తొలి కథానికగా 'దిద్దుబాటు' పేరొందింది.

★ నవయుగ వైతాళికుడు, అమితమైన మితవాది, మితమైన తీవ్రవాదిగా పేరొందారు.

★ గురజాడ గురించి చెబుతూ "ఆది కాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ తెలుగులో మహాకవులు" అని శ్రీశ్రీ వ్యాఖ్యానించారు.

★ 'కొత్తతరానికి గురువెవరంటే గురజాడ అని నేనంటాను' అన్నారు దాశరథి కృష్ణమాచార్యులు.

★ వీరేశలింగం మహాపురుషుడు, గిడుగు మహాపండితుడు కాగా గురజాడ మహాకవి అని నార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

## కొమర్రాజు వెంకట లక్ష్మణరావు (1877 – 1923)

కొమర్రాజు లక్ష్మణరావు 1877లో కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలులో జన్మించారు.

★ నాగ్‌పుర్‌లో విద్యాభ్యాసం అనంతరం కేసరి, మరాఠా పత్రికల్లో వ్యాసాలు రాసేవారు.

★ మునగాల ఎస్టేట్‌లో దివాన్‌గా పనిచేశారు. (రాజు నాయని వెంకట రంగారావు).

★ 1901లో హైదరాబాద్‌లో రావిచెట్టు రంగారావు ఇంట్లో 'శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయం' పేరుతో గ్రంథాలయాన్ని ప్రారంభించారు.

★ 1904లో హన్మకొండలో రాజరాజనరేంద్ర భాషానిలయాన్ని, 1905లో సికింద్రాబాద్‌లో సత్యసంవర్ధని గ్రంథమాల లాంటి గ్రంథాలయాలు స్థాపించారు.

★ 1906లో విజ్ఞాన చంద్రికా మండలిని కొమర్రాజు ప్రారంభించారు.

★ విజ్ఞాన చంద్రికా మండలి ప్రచురించిన గ్రంథాలు – రచయితలు

✪ ఆంధ్రుల చరిత్ర – చిలుకూరి వీరభద్రరావు

✪ రాణి సంయుక్త – పేలాల సుబ్బారావు

✪ జీవశాస్త్రం, కలరా, మలేరియా – ఆచంట లక్ష్మీపతి

✪ రసాయన శాస్త్రం – విశ్వనాథశర్మ

✪ అర్థశాస్త్రం – కట్టమంచి రామలింగారెడ్డి

★ లక్ష్మణరావు తెలుగులో తొలిసారిగా ప్రాంతీయ భాషా విజ్ఞాన సర్వస్వాన్ని ప్రచురించారు. (ఎన్‌సైక్లోపిడియా)

★ కొమర్రాజు ఆంధ్ర చరిత్ర పరిశోధక పితామహుడిగా పేరుగాంచారు.

## గిడుగు రామ్మూర్తి పంతులు (1862 – 1940)

వ్యవహారిక భాషోద్యమ పితామహుడిగా పేరొందారు. తెలుగు అనే పత్రికను ప్రారంభించారు. రావుసాహెబ్ బిరుదును ఆంగ్ల ప్రభుత్వం ఇచ్చింది. తుదివిన్నపం పేరుతో స్వీయచరిత్ర రచించారు. సవర – ఇంగ్లిష్ నిఘంటువును రూపొందించారు.

**జయంతి రామయ్య పంతులు:** సూర్యరాయాంధ్ర భాషా నిఘంటువును రూపొందించారు. 1911లో ఆంధ్ర సాహిత్య పరిషత్‌ను స్థాపించారు. 5 వేల తాళపత్ర గ్రంథాలను సేకరించి, అధ్యయనం చేశారు.

**చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు:** అంధ కవి, ఆంధ్రా మిల్టన్‌గా పేరొందారు. దేశమాత పత్రికను ప్రారంభించారు. హేమలత,

రామచంద్ర విజయం, అహల్యాబాయి చరిత్ర లాంటి గ్రంథాలు రాశారు. రాత్రి పాఠశాలలు, హరిజన పాఠశాలలు, రాజా రామమోహన్ రాయ్ పాఠశాల ప్రారంభించారు.

**ఉన్నవ లక్ష్మీనారాయణ:** మాలపల్లి నవల రాశారు. 1922లో భార్య ఉన్నవ లక్ష్మీబాయమ్మతో కలిసి గుంటూరులో శారదా నికేతన్‌ను స్థాపించారు. వితంతు శరణాలయాన్ని ప్రారంభించారు.

**దేశిరాజు పెదబాపయ్య:** 26 సంవత్సరాల వయసులోనే మరణించిన సంఘ సంస్కర్త. యువకుల ప్రార్థనా సమాజాన్ని స్థాపించారు. వాయిస్ ఆఫ్ ట్రూత్ అనే పత్రికను ప్రారంభించారు.

**రచయిత: బి. నాగరాజు**

www.eenadupratibha.net
www.eenadupratibha.net